
సాక్షి మంచిర్యాల

గురువారం : 25 : ఏప్రిల్ : 2024



ఒత్తిడిని జయిద్దాం..

పరీక్షల్లో ఫెయిలైతే జీవితంలో ఓడినట్లు కాదు.. ఓటమి గెలుపునకు నాంది కావాలి. పరీక్షల్లో తప్పిన పిల్లలకు తల్లిదండ్రులు భవిష్యత్‌పై భరోసా ఇవ్వాలి. IIలో▸



పరీక్షల్లో ఫెయిల్..

ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిలయ్యామని జిల్లాలోని వేర్వేరు మండలాల్లో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /28.0

ఆకాశం ఉదయం వేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ శాతం పెంచాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



పాల్గొన్న కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా అధికారులు కృషి చేయాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక బృందాలు నియమించామని, ఓటర్ స్లిప్పులు ప్రతీ ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళ, జెడ్పీ సీఈవో గణపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

4న కేసీఆర్ రోడ్ షో



మాట్లాడుతున్న బాల్క సుమన్

చెన్నూర్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 4న మంచిర్యాలలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, వాల శ్రీనివాస్‌రావు, నవాజ్, జెడ్పీటీసీ మోతె తిరుపతి, రాజ్‌కుమార్, రాజారమేశ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాహుల్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం స్థానిక ఎంసీహెచ్‌లోని వార్డులు, రిజిష్టర్లు, ల్యాబ్, రిసెప్షన్, ఆస్పత్రి పరిసరాలు పరిశీలించి, బాలింతలతో మాట్లాడారు. ఓపీకి వచ్చే గర్భిణులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీయడంతోపాటు వారికి ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆసుపత్రి నిర్వాహకులకు సూచించారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, ఎంసీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ భీష్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

నస్పూర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. బుధవారం ఆయన పట్టణ పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, డీఎంఎస్ రాజు, టీఎంఎస్ నాగరాజు, మెప్మా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నస్పూర్: వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. బుధవారం ఆయన నస్పూర్ పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన వేసవికాలంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఆసుపత్రి సిబ్బందికి, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సమత, సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తీర్ణతలో వెనుకంజ

- ఇంటర్మీడియట్ ఫలితాల్లో నిరాశే
- సెకండియర్‌లో రాష్ట్ర స్థాయిలో 30వ స్థానం
- 'ప్రథమ' ఫలితాల్లో 32వ స్థానం
- ప్రతిభ కనబర్చిన బాలికలు



మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతలో జిల్లా వెనుకబడింది. గత ఏడాదితో పోలిస్తే జిల్లాకు ఈ ఏడాది ఫలితాలతో నిరాశే మిగిలింది. బాలికలు మాత్రం ఎప్పటివలే ప్రతిభకనబర్చారు. బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్ర స్థాయిలో గత ఏడాది ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 17వ స్థానంలో నిలిచిన జిల్లా ఈసారి 30వ స్థానానికి పడిపోయింది. గత ఏడాది ప్రథమ సంవత్సరం 18వ స్థానం దక్కించుకోగా ఈ ఏడాది 32వ స్థానంతో చేదు ఫలితాలు మిగిల్చాయి. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు మొదటి సంవత్సరంలో 5,455 మంది పరీక్షలకు హాజరు కాగా 2,525 మంది పాసయ్యారు. 46.29శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 5,370మంది పరీక్షలు రాయగా 3,197మంది ఉత్తీర్ణత సాధించారు. 59.53శాతం ఉత్తీర్ణత నమోదైంది. వొకేషనల్ ప్రథమ సంవత్సరంలో 1,108మందికి గాను 589(53.16శాతం) మంది, ద్వితీయ సంవత్సరంలో 1,110మందికి గాను 710(63.96శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ పలితాల్లో జిల్లా గత ఏడాదితో పోలిస్తే రాష్ట్ర స్థాయిలో పడిపోవడం గమనార్హం.

బాలికలదే పైచేయి..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలుర కంటే దీటుగా రాణించి మెరుగైన ప్రతిభ కనబర్చారు. ప్రథమ సంవత్సరంలో బాలురు 34.05శాతం ఉత్తీర్ణులు కాగా.. 56.8శాతంతో బాలికలు ముందు వరుసలో నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 48.51శాతం ఉత్తీర్ణులు కాగా, బాలికలు 68.79శాతంతో హవా కొనసాగించారు. ప్రథమ సంవత్సరం వొకేషనల్‌లో బాలురు 40.98శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలు 68.35శాతం పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 48.85శాతం ఉతీర్ణత సాధించగా, బాలికలు 82.27శాతంతో సత్తా చాటారు.

సివిల్స్ లక్ష్యం



మంచిర్యాలఅర్బన్: కష్టపడి ఇంజినీరింగ్ పూర్తి చేయడం, సివిల్స్ సాధించడం తన లక్ష్యమని సన్వర్‌షిపా అలీ పేర్కొంది. అల్ఫోర్స్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతూ ఎంపీసీ గ్రూపులో 991మార్కులతో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచింది. తండ్రి నిసార్ అహ్మద్ స్థానిక మహిళా పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా.. తల్లి సాహనా అంజుమ్ మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ స్కూల్‌లో గెస్ట్ టీచర్‌గా పని చేస్తోంది. సన్వర్‌షిపా అలీ స్థానిక ట్రినిటీ హైస్కూల్‌లో పదో తరగతిలో 10జీపీఏ సాధించింది.

రెండేళ్ల ఫలితాలు ఇలా..

	2022లో..			2023లో..	
సంవత్సరం	విద్యార్థులు	హాజరు	ఉత్తీర్ణులు	హాజరు	ఉత్తీర్ణులు
ప్రథమ(రెగ్యులర్)	బాలురు	3064	1277	2616	1215
	బాలికలు	3565	2269	3040	2014
ద్వితీయ(రెగ్యులర్)	బాలురు	3012	1679	2612	1454
	బాలికలు	3517	2509	3298	2349
వొకేషనల్(ప్రథమ)	బాలురు	727	323	709	302
	బాలికలు	588	418	545	364
వొకేషనల్ (ద్వితీయ)	బాలురు	736	404	622	412
	బాలికలు	536	408	516	441

2024లో..

సంవత్సరం	విద్యార్థులు	హాజరు	ఉత్తీర్ణులు
ప్రథమ(జనరల్)	బాలురు	2520	858
	బాలికలు	2935	1667
ద్వితీయ(జనరల్)	బాలురు	2451	1189
	బాలికలు	2919	2008
వొకేషనల్(ప్రథమ)	బాలురు	612	250
	బాలికలు	496	339
వొకేషనల్(ద్వితీయ)	బాలురు	608	297
	బాలికలు	502	413

రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్



రమానీలా

చెన్నూర్: చెన్నూర్ కస్తూర్బా కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న కోటపల్లి మండలానికి చెందిన పుల్లయ్య, పద్మ దంపతుల కూతురు రమానీలా ఇంటర్‌లో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకు గాను 982 మార్కులతో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన రమానీలా ర్యాంక్ సాధించడంపై తల్లిదండ్రులు, కళాశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

తాండూర్: మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి సాత్విక్ రాష్ట్రస్థాయిలో సత్తా చాటాడు. గొల్లపల్లి వెంకటేష్, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు సాత్విక్ పదో తరగతి వరకు బెల్లంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్(సీఓఈ)లో చదివాడు. ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లో ని గౌలిదొడ్డి ప్రీమియం సీఓఈలో సీటు సాధించా డు. బైపీసీ ఫస్టియర్‌లో 440 మార్కులకు గాను 436 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. తాండూర్ కస్తూర్బాలో ఎంపీహెచ్‌డబ్ల్యు విద్యార్థిని మమత జిల్లా టాపర్‌గా నిలిచింది.

సివిల్స్ సాధించడమే లక్ష్యం



ఉన్నతంగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరుకోవాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఇంటర్‌లో బైపీసీ చదివాను. ఎంబీబీఎస్ సీటు సాధించి డాక్టర్నై, నా లక్ష్యానికి అనుగుణంగా సివిల్స్ సాధించడం కోసం పాటు పడతాను. కష్టపడి చదువుకుంటే తప్పక సివిల్స్ సాధిస్తాననే నమ్మకం ఉంది.

– గొర్లపల్లి సాత్విక్, కాసిపేట

రాష్ట్ర స్థాయిలో మెరిశారు..



సంహిత



శ్రీవల్లి




నేహా తమన్నా



తమన్నా నాజ్

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన శ్రీరాముల సత్యనారాయణ, సంగీత దంపతుల కూతురు సంహిత ఇంటర్ మొదటి సంవత్స రం ఎంపీసీలో 470మార్కులకు గాను 466మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చింది. క లమడుగు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చది వి ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. జన్నారంలోని కరిమల జూనియర్ కళాశాల విద్యార్థి విలాసారం శ్రీవల్లి ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 982 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ఎ నిమిదో ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. ఎంపీసీ సెకండియర్‌లో తమన్నా నాజ్ వెయ్యి మార్కులకు గాను 930 మార్కులు, బైపీసీ ఫస్టియర్‌లో నేహా తమన్నా 440 మార్కులకు గాను 426 మార్కుతో జిల్లా స్థాయి ర్యాంకులు, ఎంపీసీ ఫ స్టియర్‌లో కదార్ల ప్రమోద్ 470మార్కులకు గాను 415 సాధించినట్లు తెలిపారు. కస్తూరిబా పాఠశాలకు చెందిన కూన హార్థిక సీఈసీలో 1000 మార్కుల కు గాను 912 మార్కులతో మండల స్థాయిలో ప్రతి భ కనబర్చినట్లు స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి తెలిపారు. విద్యార్థులను రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అభినందించారు.



సిరికుందన

కాసిపేట: మండలంలోని సోమగూడంకు చెందిన సిరికుందన రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. సోమగూడంకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గుజ్జుల రాజేంద్రప్రసాద్, రజిత దంపతుల కుమార్తె సిరికుందన కరీంనగర్‌లోని ట్రినిటి కళాశాలలో బైపీసీ చదువుతోంది. మొదటి సంవత్సరంలో 440 మార్కులకు 436 మార్కులతో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది.

యువత మత్తుకు బానిస కావద్దు

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: యువత మత్తు పదార్థాలు, మద్య పానీయాలకు బానిస కావద్దని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో డీసీపీ అశోక్‌కుమార్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవో రాములు, హరికృష్ణ, అబ్కారీ, మద్యపాన నిషేధిత శాఖ పర్యవేక్షకులు నందగోపాల్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శైలజ, డీఈఓ ఎస్.యాదయ్య, సంక్షేమ అధికారి చిన్నయ్య, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చందనతో జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్వర్ధన్, సెంట్రల్ జీఎస్‌టీ పర్యవేక్షకులు రాజేంద్రప్రసాద్, మీన, వైద్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంపుపై అవగాహన

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచే విధంగా అన్ని శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు తమ వంతు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసంబంధాల అధికారి జే.శారద, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు

- ఆరు రోజుల్లో 41మంది అభ్యర్థులు
- నేటితో ముగియనున్న గడువు



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల జోరు కొనసాగుతోంది. బుధవారం మంచిరోజు కావడంతో పెద్దపల్లి కలెక్టరేట్‌లో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌తో పాటు మరో 11మంది నామినేషన్ ప త్రాలను ఎన్నికల అధికారి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్‌కు అందజేశారు. దీంతో ఆరు రోజుల్లో నామినేషన్ల సంఖ్య 41కి చేరింది. గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు, అగ్రనేతల సమక్షంలో మరోసెట్ నామినేషన్‌కు సిద్ధమయ్యారు.

- బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ఇరుగురాల భాగ్యలక్ష్మి, యువ తరం పార్టీ అభ్యర్థి చిలుక ఆనంద్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.
- స్వతంత్ర అభ్యర్థులు రాచర్ల రాజేశం, నీర టి శంకర్, నవీన్ నూకల, దుర్గం రా జీకుమార్, కుర్మ మహేందర్, మో టం రవీందర్, బూడిద తిరుపతి, కాశీ సతీశ్‌కుమార్, చందనగిరి శ్రీనివాస్ నామినేషన్ ప్రతాలను ఆర్వో ముజమ్మిల్ ఖాన్‌కు సమర్పించారు.

బీజేపీ బీఫారంపై ఉత్కంఠ

ఎంపీ అభ్యర్థులను ప్రధాన పార్టీలు నెల క్రిత మే ప్రకటించాయి. దీంతో తొలిరోజు బీఆర్‌ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ రెండేసి సెట్ల నామినేషన్ ప త్రాలు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ గురువారం కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, అశ్విన్ వైష్ణవ్ సమక్షంలో మరోసెట్ వే స్తానని మీడియాకు తెలిపారు. బీజేపీ నుంచి పోటీకి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత తనవంతు ప్రయత్నాలు చేస్తుండడంతో గోమాసే శ్రీనివాస్‌కు బీఫారం దక్కేనా? లేక చివరి నిమిషంలో వెంకటేశ్‌నేతకు దక్కేనా? అనే ఉత్కంఠ నెలకొంది.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్

గోమాసే శ్రీనివాస్ ఆస్తులు రూ.23.22కోట్లు

పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ తనకు రూ.23.22కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నగదు రూ.2లక్షలు, తన భార్యకు రూ.1.5లక్షల నగదు ఉన్నట్లు తెలిపారు. 10తులాల గోల్డ్‌చైన్, తన భార్యకు 35తులాల బంగారం, రెండు గోల్డ్‌చైన్లు, రెండు గాజులు, రెండు చెవిపోగులు ఉన్నట్లు చూపారు. తనపేరిట చరాస్తులు రూ.54.50లక్షలు, తన భార్య పేరిట రూ.27.75లక్షలు ఉన్నాయని, తన పేరిట రూ.64 హోమ్‌లోన్ ఉన్నట్లు చూపారు. తన పేరిట 4.27ఎకరాల వ్యవసాయ భూమి, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల్లో కలిపి రూ.22.40కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలి

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మంచిర్యాలటౌన్: ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలని, దేశ భద్రత కోసమే ఫోన్ ట్యాపింగ్ చేస్తారని, కానీ తన ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారని, దిగజారిన బీఆర్‌ఎస్‌కు పార్లమెంటు ఎన్నికల్లోనూ గుణపాఠం చెప్తారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంచిర్యాలలోని తన నివాసంలో బుధవారం పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాదిగ హక్కుల దండోరా నాయకుడు రేగుంట సునిల్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని, ఎన్నికల తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2,500 అందిస్తామని, ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. మాదిగ హక్కుల దండోరా నాయకుడు రేగుంట సునిల్ మాట్లాడుతూ బీజేపీ దళితులకు వ్యతిరేకమని, ఈ ఎన్నికల్లో మాదిగల మద్దతు కాంగ్రెస్‌కేనని స్పష్టం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగంతోనే దళితులకు హక్కులు కల్పించారని, బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని ఆరోపించారు.

క్లుప్తంగా

గుడుంబా పట్టివేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఐతపల్లిలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 80 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. గ్రామానికి చెందిన దాసరి సాయికుమార్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 80 లీటర్ల గుడుంబా లభ్యమైంది. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



బాలాజీ మృతదేహం

లింగాపూర్: బావిలోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వంజారిగూడకు చెందిన ముండే బాలాజీ (28)కి చిన్ననాటి నుంచి మతిస్థిమితం సరిగాలేదు. గతంలో పలుమార్లు ఇంటినుంచి బయటకు వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వెతికి ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 23న పంటచేనుకు వెళ్లి ఇంటికి రాలేదు. బుధవారం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా నాగర్‌గోజే సంజీవ్ పంటచేనులోని బావిలో మృతదేహం కనిపించింది. మృతుని తండ్రి ముండె శేషరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన అటకపురం లక్ష్మి (42) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. చింతలమానెపల్లికి చెందిన లక్ష్మి ఈ నెల 16న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు గాలింపులు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మహిళ భర్త అటకపురం నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు చెప్పారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన బాలిక (17) జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈ క్రమంలో తుంపెల్లి గ్రామానికి చెందిన పోలవేణి సాయి ఆమెకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో పాటు బాధితురాలి తండ్రిని కులం పేరుతో దూషించాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఐవోలు దయానంద్‌రావు, డీఎస్పీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఒత్తిడిని జయిద్దాం.. విజయం సాధిద్దాం..

- చదువులో తప్పితే... జీవితంలో ఓడినట్లు కాదు
- ఓటమి గెలుపునకు నాంది కావాలి
- ఇంటర్ ఫలితాల విడుదలతో విద్యార్థులపై ఒత్తిడి
- మంచిర్యాల జిల్లాలో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య
- తల్లిదండ్రుల భరోసా ఎంతో ముఖ్యమంటున్న నిపుణులు
- 14416 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సలహాలు, సూచనలు



మానసిక, డిప్రెషన్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్



మంచిర్యాలటౌన్: పరీక్షలు బాగానే రాశామని అనుకుని తీరా ఫలితాలు విడుదలయ్యాక మార్కులు తక్కువగా వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో.. జీవితం ఇక ఇంతే అనుకుని కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాలే గాని చీకటికి భయపడితే రేపటి ఉదయాన్ని చూడలేమనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. జీవితానికి పునాది వేసే విద్యార్థి దశలో ఎన్నోరకాల ఆటుపోట్లు సహజంగా వస్తుంటాయి. వాటిని ఎదురీది నేడు ఉన్నతస్థానానికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. అంతేకానీ ఆత్మహత్యలకు పాల్పడి కన్నవారికి కడుపుకోతను మిగిల్చి నిండు జీవితాన్ని అర్ధంతరంగా చాలించవద్దని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

పరీక్షలకు ముందే భరోసా ఇస్తేనే..

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైంది. ఇందులో ఇద్దరు జిల్లా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. పరీక్షలో తప్పామని, మార్కులు తక్కువగా వచ్చాయనే కారణాలతో ఆత్మహత్యకు పాల్పడే ధైర్యం ఉన్న వారు ఆ ధైర్యాన్ని జీవితంలో ఎదిగేందుకు ఉపయోగిస్తే అనుకున్నది సాధించే అవకాశం ఉందని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు చదువులో ఒత్తిడిని లేకుండా ముందునుంచే చూడాలి. చదువు, ఆతర్వాత పరీక్షలు వంటి అంశాలపై విద్యార్థుల మానసిక ప్రభావం ఎంతగానో ఉంటుందని ముందుగానే గుర్తించి తల్లిదండ్రులు పిల్లల్లో భరోసా కల్పిస్తే ఫలితాలు వెలువడే నాటికి వారిలో ఫెయిల్ అయ్యామనే ఆత్మన్యూనతా భావం తొలగిపోయి సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతారు. పిల్లలకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు వారి భవిష్యత్‌పై అవగాహన కల్పించాలి. తరచూ ఇరుగు పొరుగు పిల్లలతో పోల్చడం, ఇతరుల కంటే ఎందుకూ పనికి రారని పల్చన చేయడం వంటివి చేయవద్దు. వారితో సన్నిహితంగా ఉంటూ ప్రోత్సహించాలి. జీవితంలో చదువు ఒక్కటే కాదని ధైర్యంగా ఎలాంటి వాటినైనా ఎదుర్కొంటామనే భరోసా నింపాలి.

ఆత్మహత్యా భావన వస్తే కాల్ చేయండి

పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చే వారికి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఏర్పాటు చేసిన మెంటల్ హెల్త్ క్లినిక్‌లో సైక్రియాట్రిస్టు ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి భరోసా కల్పిస్తున్నారు. సమస్యలతో వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి మందులు ఇస్తున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు క్లినిక్ తెరిచి ఉంచుతున్నారు. విద్యార్థులు చదువులో వెనుకబడటం, ఏకాగ్రత లోపించడం, అధిక చురుకుతనం, తరచూ కోపం తెచ్చుకోవడం, దూకుడుతనం, శారీరక, మానసిక అభివృద్ధి ఆలస్యం మొదలైన సమస్యలకు తగిన సలహాలు, సూచనలు, అవసరమైన చికిత్సను తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారి కోసం టెలీమానస్ 14416 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రులు, టీచర్ల సపోర్టు ఉండాలి



స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంను పిల్లలతో పాటు తల్లిదండ్రులు, లెక్చరర్లకు అవగాహన కల్పించాలి. ఒక పరీక్ష ఫెయిల్ అయితే జీవితం ఆగిపోతుందనే భావన తొలగిపోవాలి. తల్లిదండ్రులు, టీచర్ల నుంచి సపోర్టు వస్తే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు ఫెయిల్ అయినా మా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారనే భరోసా కలిగి ఉంటారు. ఆత్మహత్య చేసుకునే వరకు వెళ్లే అవకాశం ఉండదు.

– డాక్టర్ సునీల్ కుమార్, సైకియాట్రిస్టు, జిల్లా మానసిక ఆరోగ్య క్లినిక్, జీజీహెచ్

ఓటమిని ఎదుర్కోవడం నేర్పించాలి



ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు గెలుపు ఎలా ఉండాలనే నేర్పిస్తారు. కానీ ఓటమిని ఎదుర్కోవడాన్ని నేర్పించరు. ఆత్మహత్య చేసుకునే వారిలో ఎక్కువగా సొసైటీకి భయపడి, ఎవరో ఏదో అనుకుంటారనే భయం వల్లనే. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠాలను చదవాలి. పరీక్షల నాటికే అన్నీ ఒక్కసారిగా చదువుతామంటే పరీక్షల్లో ఏంరాయలేని పరిస్థితి నెలకొని ఫలితాలపై ప్రభావం చూపుతుంది. పిల్లలపై ఎక్కువగా ఒత్తిడి చేయకుండా, స్వేచ్ఛగా చదువుకునేలా తల్లిదండ్రులు, అధ్యాపకులు చూడాలి.

– డాక్టర్ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రముఖ సైకాలజిస్టు

పరీక్షల్లో ఫెయిల్.. ప్రాణం తీసుకున్నారు..

- వేర్వేరుగా ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య
- రెండు కుటుంబాల్లో విషాదం



సాత్విక్ (ఫైల్)

తాండూర్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మంచిర్యాల జిల్లాలో ఇద్దరువిద్యార్థులు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనలు ఆయా కుటుంబాల్లో విషాదం మిగిల్చాయి. వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన మైదం నారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుల్లో చిన్నవాడైన మైదం సాత్విక్(18) బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో నాలుగు సబ్జెక్టులు తప్పాడు. బంధువుల ఇంట్లో పెళ్లి ఉండడంతో తల్లిదండ్రులు తాండూర్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాత్విక్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తాతకు పాసయ్యానని చెప్పి..

ఇంటర్ ఫలితాలు వెల్లడైన కొద్దిసేపటికి సాత్విక్ ఇంటికి వెళ్లాడు. ఇంటి సమీపంలోని బావి వద్ద తాత రాజయ్య పరీక్ష ఏమైంది బిడ్డా అని పలకరించడంతో పాసయ్యానని, 450 మార్కులు వచ్చాయని చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. ఆ తర్వాత తల్లిదండ్రులు ఇంటికి చేరుకోగా తలుపు వేసి ఉండడంతో కంగారు పడ్డారు. కిటికీ లోంచి చూసే సరికి సాత్విక్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పాసయ్యా అని చెప్పితివి గదా బిడ్డా.. గంతట్లనే గిట్ల జేసుకుంటివేమని.. తాత మనవడి మృతదేహంపై పడి రోదించిన తీరు కంటతడి పెట్టించింది. పరీక్ష ఫలితాల వెల్లడికి ఒక రోజు ముందు సహచరులతో సాత్విక్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తాండూర్ ఎస్సై జగదీష్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నస్పూర్‌లో విద్యార్థిని..



గట్టిక తేజశ్విని (ఫైల్)

నస్పూర్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిలయ్యాయని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దొరగారి పల్లెకు చెందిన గట్టిక తేజశ్విని(18) మంచిర్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో గణితం సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్రూంలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యార్థిని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

కోచ్‌ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో నిర్వహించనున్న వేసవి శిబిరాల్లో శిక్షణ ఇవ్వడానికి అనుభవం ఉన్న కోచ్‌లు ఈనెల 29లోగా మందమర్రి ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్‌లో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, ఎంపికైన వారికి గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసుకోవాలి

నస్పూర్: సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయి సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ (నాన్ ఎగ్జిక్యూటివ్) కార్డు కలిగి ఉన్న మాజీ ఉద్యోగులు మెడికల్ కార్డులను రెన్యూవల్ చేసుకోవాలని సింగరేణి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకు ప్రతీ సంవత్సరం నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని దాదాపు 973 మంది మాజీ ఉద్యోగులు వారి భార్యల మెడికల్ కార్డులు రెన్యూవల్ కోసం లైఫ్ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు.

ఐకే1ఏ గనిలో ప్రమాదం!

జైపూర్: ఇందారం ఐకే1ఏ గనిలో బుధవారం మొదటి షిఫ్టులో జరిగిన ప్రమాదంలో బొద్దు తిరుపతి అనే ఎలక్ట్రీషియన్ కార్మికుడికి గాయాలయ్యాయి. విధుల్లో భాగంగా తిరుపతి గని లోపలి భాగంలో వెల్డింగ్ ప్లాంటుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో చేతికి విద్యుత్ షాక్ తగలడంతో చేయి, ముఖానికి గాయాలైనట్లు తెలిసింది. అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినట్లు సమాచారం.

రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన సంయుక్త



గొల్లాల సంయుక్త

నస్పూర్: శ్రీరాంపూర్‌కు చెందిన గొల్లాల సంయుక్త ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంఈసీ విభాగంలో 1000 మార్కులకుగానూ 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. శ్రీరాంపూర్ ఏరియా ఐటీ విభాగం హెచ్ఓడీ సీనియర్ ప్రోగ్రామర్ జి.శ్రీనివాస్ కుమార్తె సంయుక్త హైదరాబాద్‌లోని లక్ష్య కామర్స్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఏరియా జీఎం సంజీవరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



అనిల్‌కుమార్ గౌడ్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన బొమ్మగొని తిరుపతి గౌడ్-తిరుపతమ్మ దంపతుల కుమారుడు అనిల్‌కుమార్ గౌడ్ (28) మంచిర్యాలలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఉక్కపోతగా ఉందని ఇంట్లోని కూలర్ ప్లగ్‌ను జంక్షన్ బాక్స్‌లో బిగించే క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనా?

కాలనీలో ఏర్పాటు చేసిన డీటీఆర్‌కు వారం రోజులుగా హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అవుతోందని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అనిల్ మృతిచెందినట్లు గ్రామస్తులు ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఈ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బెల్లంపల్లి: బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం బెల్లంపల్లిలోని డిస్కం ఏఈ కార్యాలయం ఎదుట తాళ్ల గురిజాల గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సై నరేష్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదలబోమని భీష్మించుకు కూర్చున్నారు. డిస్కం అధికారులు రూ.2 లక్షలు నగదు ఇవ్వడానికి అంగీకరించి అందులో నుంచి కొంత మొత్తం అందజేశారు. విద్యుత్ శాఖ తరపున ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బొగ్గు ఉత్పత్తి ద్వారా లాభాలు పెంచాలి

- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం



వ్యూపాయింట్ నుంచి ఖైరిగూడ ఓసీపీని పరిశీలిస్తున్న సీఎండీ ఎన్.బలరాం, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు ఉత్పత్తి ద్వారా సంస్థ లాభాలు పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం సూచించారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా బుధవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి పని ప్రదేశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆర్జిస్తున్న లాభాల్లో బొగ్గు ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉంటోందన్నారు. ఉత్పత్తి వ్యయం అధికంగా ఉండడంతో లాభాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించి, బొగ్గు ఉత్పత్తి ద్వారా లాభాలు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. గడిచిన సంవత్సరం మాదిరిగానే ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాలు సాధించాలన్నారు. గతేడాది వార్షిక లక్ష్యాలు సాధించిన ఏరియా ఉద్యోగులు, అధికారులకు అభినందలు తెలిపారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతపై అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖైరిగూడ ఓసీపీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు సాధించిన ఉత్పత్తి లక్ష్యాలను జీఎం రవిప్రసాద్ వివరించారు. గోలేటి సీహెచ్‌పీ ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 39.5 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఏరియా చరిత్రలో ఇదే అత్యధికమని, 984 రేకుల బొగ్గును పోయిన ఏడాది ఏరియా నుంచి రవాణా చేయగలిగినట్లు సీఎండీకి వివరించారు. నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీ ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అటవీ భూముల సేకరణ ప్రక్రియపై మే తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందని సీఎండీ తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి గోలేటి ఓసీపీ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యేలా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సర్వే అధికారి చంద్రశేఖర్, సివిల్ ఎస్ఈ బాషా, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రైతు అంకయ్య (ఫైల్)

వేమనపల్లి: మండలంలోని జాజులపేటకు చెందిన రైతు నానయ్య-గంగమ్మ దంపతుల కుమారుడు అంకయ్య సోమవారం తమ కుమార్తె కావ్యతో కలిసి చెన్నూర్‌కు వెళ్లి బైక్ మరమ్మతులు చేయించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో బతుకమ్మ వాగు వంతెనపైకి రాగానే వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న పిట్ట గోడలను ఢీకొట్టాడు. అంకయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం, మాజీ సర్పంచ్‌లు కొండగొర్ల బాపు, కుబిడె మధుకర్ మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిలిచిన యువతి వివాహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లికి చెందిన సంపత్‌గౌడ్ మందమర్రికి చెందిన యువతి గతంలో పాఠశాలలో చదువుకున్నప్పుడు సాన్నిహిత్యంగా ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత ఆ యువతి పెళ్లిచేసుకోమని కోరడంతో నిరాకరించాడు. ఈ విషయమై ఏడాది క్రితం షీ టీంలో ఫిర్యాదు చేయగా కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ ఆమె జోలికి వెళ్లనని చెప్పడంతో వదిలేశారు. సదరు యువతికి బెల్లంపల్లికి చెందిన యువకునితో ఈ నెల 24న పెళ్లి నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న సంపత్‌గౌడ్ బెల్లంపల్లికి వెళ్లి ఆ యువకునితో గతంలో జరిగిన విషయాలు చెప్పడంతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బుధవారం జరగాల్సిన పెళ్లి నిలిచిపోయింది. యువతి ఫిర్యాదు మేరకు సంపత్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.


వైద్య కళాశాలకు పార్థివదేహం



అప్పగిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మి (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య, కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు రామాంజనేయులు ద్వారా మృతదేహాన్ని కళాశాలకు అప్పగించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రరెడ్డి, ప్రొఫెసర్ జితేంద్ర, వేంపల్లి ఎంపీటీసీ డేగ బాపు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మైకల్ యార్క్ డాక్యుమెంటరీలపై సమావేశం



డాక్యుమెంటరీలోని చిత్రం (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: బ్రిటిష్ మానవ శాస్త్రవేత్త, ప్రఖ్యాత డాక్యుమెంటరీ చిత్ర దర్శకులు డాక్టర్ మైకల్ యార్క్ రూపొందించిన ఛాయాచిత్రాలు, అనువాద పుస్తకం, రాజ్‌గోండుల దండారీ పండుగపై డాక్యుమెంటరీ చలనచిత్రాలపై ఈ నెల 25న జూమ్ వేదికగా 'చేరువై విలీనమవుతున్న క్షితిజాలు, దృశ్యమాన మానవ శాస్త్రం, మూలవాసీ సమాజాలు, ఆన్‌లైన్ మీడియా ఆర్కైవ్‌ల ప్రయోజనం'పై రౌండ్ టేబుల్ చర్చ ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అపర్ణ శర్మ(యూసీఎల్‌ఏ) అధ్యక్షతన జరగనుండగా చర్చలో ప్రముఖ చిత్ర దర్శకులు, మానవ శాస్త్రవేత్త మైకల్ యార్క్, హెర్క్యులస్ సింగ్ ముండా (ఎడిన్‌బర్గ్), అర్పిత్ గైండ్ (యూసీఎల్‌ఏ) పాల్గొంటారని, జూమ్ మీటింగ్‌లో పాల్గొనేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9676180802 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'రాజారం'ను సందర్శించిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రామస్తులు తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలేదని పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వాగుపై వంతెనలు లేక పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని, వానాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తేనే ఓటు హక్కును వినియోగించుకుంటామని అధికారులతో తెగేసి చెప్పారు. దీంతో అధికారులు చేసేదేంలేక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పి వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం గోవెనకు చెందిన ఆత్రం చిన్ను, కొడప గంగారాం ఆసిఫాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో మోవాడ్ నుంచి చింతగూడకు వెళ్తున్న ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆత్రం చిన్ను, కొడప గంగారాంకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట క్షతగాత్రులను 108లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పదోతరగతికి 671 మంది, ఇంటర్‌కు 1,330 మంది హాజరుకానున్నారు. బెల్లంపల్లిలో మూడు, మంచిర్యాలలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

'బీజేపీని గెలిపించాలి'

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో బుధవారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బోయిని హరికృష్ణ, బొద్దున మల్లేశ్, జోగుల శ్రీదేవి, కిషోర్, రాజబాబు, బింగి సత్యనారాయణ, కంకణాల సతీశ్ పాల్గొన్నారు.

కెరీర్ సదస్సులో ప్రతిభ

మంచిర్యాలటౌన్: కల్పన, విజ్ఞానశాల టీం అనుసంధానంతో హైదరాబాద్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఫిబ్రవరి 9 నుంచి నిర్వహించిన రీ ఇమాజినింగ్ పాసిబులిటీస్ ఫర్ ఉమెన్ ఇన్‌స్టెమ్ కెరీర్స్‌పై ఆన్‌లైన్ తరగతుల్లో మంచిర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డి.సుమతి తెలిపారు. కెరీర్ వ్యాలిడిక్టరీ సమావేశాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో నిర్వహించగా 42 గురుకుల కళాశాలల నుంచి 800ల మంది విద్యార్థినులు పాల్గొన్నారు. మంచిర్యాల కళాశాలకు చెందిన 32 మందికి ప్రశంస పత్రాలు అందజేశారు.